క్లుప్తంగా

ఎల్ఆర్ఎస్ గడువు పొడిగించాలి

నల్లగొండ టౌన్ : ప్లాట్ల క్రమబద్ధీకరణకు 25 శాతం సబ్సిడీ గడువు పొడిగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండీ సలీమ్, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, దండెంపల్లి సరోజ, కోట్ల అశోక్‌రెడ్డి, గాదె నరసింహ, భూతం అరుణ తదితరులు పాల్గొన్నారు.

హఫీజ్‌కు ఉగాది పురస్కారం

కనగల్ : మండల కేంద్రానికి చెందిన మాజీ కోఆప్షన్ సభ్యుడు, గాయకుడు డా.ఎండీ హఫీజ్ ఉగాది పురస్కారం అందుకున్నారు. స్వర విహార కళా సాంస్కృతిక త్యాగరాయ గానసభ హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో శుక్రవారం హఫీజ్‌కు దైవజ్ఞ శర్మ, జ్యోత్స్నేశ్వరి పురస్కారం అందజేశారు.

పౌరహక్కుల దినోత్సవం

తిప్పర్తి : మండలంలోని మర్రిగూడెం గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిప్పర్తి తహసీల్దార్ పరశురాములు పాల్గొని మాట్లాడుతూ దళితవాడలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్లు, రేషన్ కార్డులు వచ్చేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ ద్రోణార్జున, మాజీ సర్పంచ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

నల్లగొండ టూటౌన్ : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేద ప్రజలకు వరం లాంటిదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 41 మంది పేదలకు శనివారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో రూ.13 లక్షల 66 వేల విలువ గల చెక్కులను అందజేసి మాట్లాడారు.

విద్యార్థుల ప్రతిభ

చిట్యాల: ఏకలవ్య ఐఐటీ, నీట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్లో చిట్యాల పట్టణంలోని సెయింట్ మేరీ స్కూల్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. శనివారం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులు అవార్డులు అందుకున్నట్లు ఆ స్కూల్ కరస్పాండెంట్ గట్టు అలెగ్జాండర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏడో తరగతి విద్యార్థిని ఎస్.ఇషికిత స్టేట్ టాపర్‌గా, ఎనిమిదో తరగతి విద్యార్థిని జె.నిహారిక, ఆరో తరగతి విద్యార్థిని పి.జాస్మిత జిల్లా టాపర్లుగా నిలిచారన్నారు. వీరికి ఏకలవ్య ఫౌండేషన్ అవార్డులను సీఈఓ వి.నర్సింహ, మహేంద్ర టెక్ మాజీ సీఈఓ విజయ్‌రంగినేని అందజేశారు.


పాఠశాలలు సృజనాత్మక కేంద్రాలుగా ఉండాలి

నకిరేకల్ : పాఠశాలలు సృజనాత్మక కేంద్రాలుగా ఉండాలని ఎంఈఓ మేకల నాగయ్య అన్నారు. తాటికల్ జెడ్పీ హైస్కూల్‌లో శనివారం జరిగిన బాల కవి సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పదిహేను మంది బాల కవులు చదివిన కవితలు ఆకట్టుకున్నాయి. అనంతరం బాల కవులను సత్కరించారు. కార్యక్రమంలో యోగా గురువు మాదగాని శంకరయ్య, రిటైర్డు ఉపాధ్యాయుడు కరీం, ఉపాధ్యాయులు వెంకన్న, పండుగ తిరుమలయ్య హరీష్, మార్త రాములు, సాగర్ల సత్తయ్య, నర్రా వెంకట్‌రెడ్డి, కోటయ్య, జానయ్య, పద్మ పాల్గొన్నారు.

అభిషేక మహోత్సవం

రామగిరి(నల్లగొండ): నీలగిరి కాలనీలో లక్ష్మీనరసింహస్వామి, విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి 40 రోజులు పూర్తయిన సందర్భంగా శనివారం మండల అభిషేక మహోత్సవంవేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ఐకేపీ ఏపీఎం కృష్ణ మృతి



ఓగోటి కృష్ణ

శాలిగౌరారం: రంగారెడ్డి జిల్లా డీఆర్‌డీఓ కార్యాలయంలో ఏపీఎంగా విధులు నిర్వర్తిస్తున్న శాలిగౌరారం మండలంలోని ఎన్‌జి కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓగోటి కృష్ణ (49) అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన అంత్యక్రియలు శనివారం స్వగ్రామమైన ఎన్‌జి కొత్తపల్లిలో నిర్వహించారు. కృష్ణ మృతదేహాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా కృష్ణ మృతదేహానికి నల్లగొండ డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి నివాళులర్పించారు. దహన సంస్కారాల కోసం ప్రభుత్వం అందించిన రూ.30వేల ఆర్థికసాయాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. నివాళులర్పించిన వారిలో సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏపూరి నర్సయ్య, ఉపాధ్యక్షుడు మన్నె వెంకట్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల అధ్యక్షులు గుండ్లపల్లి నరహరి, జానిమియా, నర్సయ్య తదితరులున్నారు.

ఆకస్మిక తనిఖీ

చండూరు : మండలంలోని చొప్పరివారిగూడెంలో అంగన్‌వాడీ కేంద్రం, గ్రామపంచాయతీ కార్యాలయం, నర్సరీని ఎంపీడీఓ బండారు వెంకటయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఎస్టీపీ పనులు త్వరగా పూర్తి చేయాలి

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) పనులు ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తిచేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రం సమీపంలోని శేషమ్మగూడెం వద్ద ఉన్న ఎస్టీపీని కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. 2014లో రూ.38 కోట్లతో ప్రారంభమైన ఎస్టీపీ పనులు ఇప్పటి వరకు పూర్తికాకపోవడం బాధాకరమన్నారు. నీలగిరి పట్టణంలో 80 శాతం ఇళ్ల నుంచి డ్రెయినేజీ కనెక్షన్లు ఇవ్వడం పూర్తయినట్లు తెలిపారు. వెంకటేశ్వర కాలనీ, రాఘవేంద్రకాలనీలో ఎస్టీపీ కనెక్షన్లు ఉన్నాయని, మిగతా వాటికి కూడా త్వరలోనే కనెక్షన్‌లు ఇస్తామన్నారు. ఎస్టీపీ చుట్టూ గార్డెన్ ఏర్పాటు చేయాలని, మొక్కలు నాటించి, టైల్స్, పెయింటింగ్ లాంటి పనులు కూడా త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నర్సప్పగూడెం వద్ద సాంకేతిక పరిజ్ఞానంతో మరో ఎస్టీపీని ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం పానగల్‌లోని ఛాయాసోమేశ్వర ఆలయం వెనుక వైపు ఉన్న కుంట రోడ్డును, ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. మంత్రి వెంట మున్సిపల్ కమిషనర్ సయ్యద్‌ముసాబ్ అహ్మద్, ప్రజారోగ్య శాఖ ఎస్ఈ కందుకూరి వెంకటేశ్వర్లు, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అబ్బగోని రమేష్‌గౌడ్, గుమ్ముల మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



శేషమ్మగూడెం వద్ద ఎస్టీపీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, కలెక్టర్

మార్నింగ్ వాక్ చేసి.. వాలీబాల్ ఆడి

నల్లగొండ: రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో మార్నింగ్ వాక్ చేశారు. ఉదయం 6 గంటలకు వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేస్తూ వారి సమస్యలను సావధానంగా విన్నారు. కళాశాలలో కాంపౌండ్ వాల్ పక్కన స్థానికులు చెత్త వేయడం వల్ల ఇబ్బంది అవుతోందని మంత్రి దృష్టికి వాకర్స్ తీసుకురాగా.. అక్కడికక్కడే అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఆ తర్వాత వాలీబాల్ ఆడుతున్న వారితో కలిసి మంత్రి వాలీబాల్ ఆడారు. అక్కడే వాకర్స్‌తో కలిసి గ్రీన్ టీ తాగుతూ వాకర్స్‌తో ముచ్చటించారు. ఆ తర్వాత అక్కడే జావ అమ్మేవారి వద్దకు వెళ్లి పలకరించారు. ఎన్జీ కాలేజీ ఎదురుగా ఉన్న ఫిల్టర్ కాఫీ హోటల్‌కు వెళ్లి అక్కడికి వచ్చిన వారందరితో ముచ్చటించారు. అక్కడ నుంచి రామగిరి సెంటర్‌కు వెళ్లి గాంధీ విగ్రహం వద్ద సువర్ణ అనే మహిళ నిర్వహిస్తున్న టిఫిన్ బండి వద్ద ఆగి ఇడ్లీ తిన్నారు. ఆమె బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు లేదనడంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. తనకున్న చిన్నపాటి భూమి విషయంలో అధికారులు పేచీ పెడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకురాగా.. వెంటనే అక్కడ ఉన్న తహసీల్దార్‌ను పిలిచి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.



ఎన్జీ కళాశాలలోని ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

తాగునీటి సమస్య రాకుండా చూడండి

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : వేసవిలో నకిరేకల్ పట్టణంలో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులకు సూచించారు. నకిరేకల్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాన్నీ ఒకేచోట ఉండేలా పునర్నిర్మాణం కోసం చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న పోలీస్ స్టేషన్‌ను ఆర్టీసీ బస్టాండ్‌లోకి తరలించి, ఆ స్థానంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి కసరత్తు చేస్తున్నామని తెలిపారు. అనంతరం 2025–26 సంవత్సరానికిగాను రూ.48 కోట్ల బడ్జెట్‌ను పాలకవర్గం ఆమోదించింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బాలయ్య, వైస్ చైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణి, కౌన్సిలర్లు కందాల భిక్షంరెడ్డి, రాచకొండ సునీల్, దైద స్వప్న, కొండ శ్రీను, గర్శకోటి సైదులు, పోతులు సునీత, వంటిపాక సోమలక్ష్మీ, పన్నాల పావని, యాసారపు లక్ష్మీ, మట్టిపల్లి కవితా, చౌగోని రాములమ్మ, అఖిల, గడ్డం స్వామి, బానోతు వెంకన్న, స్వాతి పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి

చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లో చేనేత డైయింగ్ ఆవరణలో శనివారం జరిగిన చేనేత పారిశ్రామిక సహకార సంఘం 84వ సాధారణ మహాసభకు ఆయన ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. చేనేత శాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ పద్మ మాట్లాడుతూ కార్మికులకు ఏ సమస్య వచ్చినా నేరుగా తనకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే తక్షణ పరిష్కారం చూపుతానని అన్నారు. సంఘం అధ్యక్షుడు చిలుకూరి లక్ష్మీనర్సయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధికారులు ద్వారక్, ప్రసాద్, గోపాల్, మున్సిపల్ కౌన్సిలర్ పోడుగు స్వాతి, గంజి మురళి, నర్సింహ, పెండెం రాములు, రావిరాల మల్లయ్య, జనార్దన్, కృష్ణమూర్తి, సుధాకర్, పద్మయ్య, యల్లయ్య, వెంకటేషం, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, పద్మ, కమలయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

తృటిలో తప్పిన ప్రమాదం

చిట్యాల: పట్టణంలోని అరవై ఐదో నంబరు జాతీయ రహదారిపై పోలీస్‌స్టేషన్ ఎదురుగా జంక్షన్‌లో శనివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా గల జంక్షన్ వద్ద నార్కట్‌పల్లి వైపు నుంచి హైదరాబాద్ వైపు లోడుతో లారీ వెళుతోంది. అదే సమయంలో టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనం రోడ్డు దాటుతుండగా ఆ వాహనాన్ని తప్పించేందుకుగాను లారీ హైదరాబాద్–నార్కట్‌పల్లి రోడ్డులోకి వెళ్లి డివైడర్‌ను ఢీకొట్టి నిలిచిపోయింది. ఆ సమయంలో హైదరాబాద్–నార్కట్‌పల్లి రోడ్డులో ఎదురుగా వాహనాలు రాకపోవడంతో ఘోర రోడ్డు ప్రమాదం తప్పినట్లయింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

ఆలయ హుండీ లెక్కింపు

చిట్యాల: పట్టణంలోని శ్రీకనకదుర్గ ఆలయ హుండీ లెక్కింపు శనివారం ఆలయ అధికారులు, పాలకవర్గ సభ్యులు చేపట్టారు. గత ఏడాది ఆగస్టు 8వ తేదీ నుంచి శనివారం వరకు భక్తులు హుండీలో వేసిన డబ్బులను లెక్కించగా రూ.87,660 నగదు వచ్చినట్లు ఆలయ అధికారి నాగిరెడ్డి తెలిపారు. ఎండోమెంట్ అధికారి సుమతి పర్యవేక్షణలో జరిగిన ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులుగౌడ్, ఆలయ అధికారి నాగిరెడ్డి, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో విఫలం



మర్రిగూడ : మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి

మర్రిగూడ : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ మండల స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో జిల్లాలోని ఇద్దరు మంత్రులు విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో యాస అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు అశోక్‌రెడ్డి, బోయపల్లి రాజుగౌడ్, పగిళ్ల లింగస్వామి, పందుల రాములుగౌడ్, గ్యార యాదగిరి, అంబాల రమేష్, కుమారస్వామి, జిల్లాకుల సైదులు, శ్రీనివాస్‌రావు, కుక్కల వెంకటేష్, శ్రీనివాస్‌రావు, యాదయ్య, ప్రదీప్‌రెడ్డి, చాపల వెంకన్న పాల్గొన్నారు.

మునుగోడు: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రజల నుంచి ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ కనీసం 50 శాతం రైతులకు కూడా రుణమాఫీ చేయలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య, కల్వకుంట్ల మాజీ సర్పంచ్ పగిళ్ల భిక్షం, యాదయ్య, పన్నింటి నరేందర్ రెడ్డి, మహేశ్వరం గాలయ్య, క్రాంతి, దాం విష్ణు, అనిల్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సుంకరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు



అవార్డులు అందుకుంటున్న కవులు

రామగిరి(నల్లగొండ): సుంకరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను నల్లగొండ పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కళావతి మల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ ఏడు సంవత్సరాలుగా విశేష సేవలు అందిస్తున్న ప్రముఖులు, సంఘ సేవకులు, మేధావులకు ఉగాది పండుగ సందర్భంగా సత్కారాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమాజాన్ని చైతన్య పరచడంలో కవుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, సురేష్‌గుప్తా, ఎన్.భీమార్జున్‌రెడ్డి, డాక్టర్ రావిరాల అంజయ్య, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గాలి వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

నల్లగొండ టూటౌన్ : ఆస్తి పన్ను చెల్లించి నీలగిరి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సయ్యద్‌ముసాబ్ అహ్మద్ అన్నారు. శనివారం పట్టణంలోని పలు కాలనీలకు వెళ్లి ఆస్తి పన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్ను బకాయి ఉండిన వారికి వడ్డీలో 90 శాతం మాఫీ అవకాశం ఉందని, దీనిని వినియోగించుకుని బకాయి డబ్బులు మొత్తం చెల్లించాలని కోరారు. ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు. రెండు రోజులు పండుగలు వచ్చినా మున్సిపల్ కార్యాలయం యథావిధిగా పని చేస్తుందని, పట్టణ ప్రజలు మున్సిపల్ ఉద్యోగులకు గానీ, మున్సిపల్ కార్యాలయంలో గానీ పన్ను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో శివరాంరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

20 ఏళ్లుగా పంచాంగం ఆవిష్కరణ

రామగిరి(నల్లగొండ) : తెలుగు నూతన సంవత్సరంగా ఉగాది పండుగను జరుపుకుంటారు. ఉగాది నుంచి కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. పండుగ నాడు పంచాంగ శ్రవణం ఉంటుంది. పంచాంగంలో ఆ సంవత్సరంలోని ముహూర్తాలు, రాశి ఫలాలను పేర్కొంటారు. వాటిని బట్టి జోతిష్యం ఉంటుంది. నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన పెన్నా మోహనశర్మ 20 ఏళ్లుగా పంచాగాన్ని ఆవిష్కరిస్తున్నారు. వేద భారతి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాడు. వివిధ పీఠాధిపతులచే పంచాంగంనాన్ని ఆవిష్కరించి అర్చకులు, బ్రాహ్మణులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.



పంచాంగం ఆవిష్కరిస్తున్న మంత్రి (ఫైల్)

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

రామగిరి(నల్లగొండ): అంకితభావంతో పనిచేస్తే ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టులో సీనియర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎంఏ.మతిన్, సబ్ కోర్టులో పని చేస్తున్న సీహెచ్.మల్లేష్ పదవీ విరమణ సన్మానోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మాతంగి వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 2వ అదనపు న్యాయమూర్తి రోజారమణి, 4వ అదనపు న్యాయమూర్తి కవిత, సీనియర్ సివిల్ జడ్జీలు తేజ కార్తీక్, దీప్తి పాల్గొన్నారు.



ఉద్యోగిని సన్మానిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఉగాది కవితలు

శాతవాహన శోభితం కాకతీయ కళారూపం
జుంటితేనెల తెలుగు వైభవం ఉగాది మురిపం
కోయిలగానం వసంత కోలాహలం
వేప పూత మామిడి కాత షడ్రుచుల సమ్మిళిత
తెలుగందచందాల సుగంధం వెదజల్లుతున్న
పచ్చని మాగానం కలలు ఊట చెలిమలై పారు
తున్న కోటి ఆశల అనంత
జీవనసేతువు తెలంగానం



- భూతం ముత్యాలు
కొండాపురం, చండూరు

కోయిల హ్యాపీ బర్త్ డేతో
ఉగాది పులకించి పోతది
ఆరు ఋతువుల కాలాన్ని మర్చిపోయి
షడ్రుచుల మేళవింపులో
భవిష్యత్తు అల్లుకుంటది
పంట చేలో పంచ ప్రాణాలు పోసి
పాడి పంటలతో పులకించే రైతన్న
పంచాంగాలు ప్రవచనాలు
ఆశలు రేపె కవి సమ్మేళనాలు
తిలకించి తరించే జనాలన్నా



సర్దార్ బహదూర్‌సింగ్, చిట్యాల

ఉగాది పండుగ వచ్చిందని
ఉరుకులు పరుగులు పెట్టిన జనం
ఊరంతా ఎక్కడ వెతికినగానీ
దొరకని మామిడి, చింత, వేపల వనం
దొరికిన చెట్లను దొరికినట్టు
వదలకుండ కొట్టి పడేసిన వైనం
పచ్చని చెట్లను పెంచని చోట పండుగ పూట పచ్చడి కానం
ఇప్పటికైనా కళ్లు తెరవాలి మనం
వృక్షో రక్షతి రక్షితః కావాలి మన నినాదం..



పి.నర్సింహ, ఉరుమడ్ల

తెల్లారెన్గద! నేడుగాది! శుభమై
తీండ్రించె సౌదామినుల్
ఉల్లాసంబుగ లోకమంత
మురియన్ యుప్పొంగె వాసంతమై
సల్లాపంబులు చేసిరందరెదతో
సౌహార్ద సంతుష్టులై
కల్లోలంబికమానవాళి మరచున్
కల్యాణ సౌజన్య మై!..
పికము గాంధర్వ గానమ్ము ప్రియము గొల్ప
మామిడాకుల తోరణమయము గాగ
ఆరు రుచులైన పచ్చడి నారగించ
సకల కుసుమాలనింటిలో సంస్కరించ
తెలుగువారింటి లక్ష్మియై వెలుగులీని
వచ్చె విశ్వావసు విమల వైభవమ్ము!



డాక్టర్ చింతోజు మల్లికార్జున చారి
నల్లగొండ

కొత్త చిగురు రాక కోకిలమ్మ
కూత ఆగని ఎదురుచూపులు
నీ ఉషస్సులకై ఆశల సందడి
రాలిపడిన ఆకులు
నవ చరితకు శక్తి దారలంటూ
షడ్రుచుల సమ్మిళితమైన
జీవతత్వ బోధినీ ఉగాది నీకు స్వాగతం!



వెంకటేశ్వర్లు, నకిరేకల్

ఉగాది పండుగ తెలుగు
సంవత్సరానికి షడ్రుచులు
మామిడి వేప తోరణాలతో
ఇల్లంతా పచ్చదనం
చింతపులుసు మామిడి ఒగరు
కొత్త కుండ నిండా అమ్మ ప్రేమతో పోసిన
కొత్త గురిగి పచ్చడంతా కడుపు నిండా ఉగాదే
కనబడేది ఆ రోజుల్లో..
ఇప్పుడు ఉగాది అన్నా ఒక ఆదివారమే
ఉగాది పండుగ ప్రతి పనికి ఆరంభ పండుగ
భూతల్లి పురిటికాతే రైతన్న ఘర్సనిండా పంట
మంచి చెడుల ప్రారంభ రోజే తెలుగు ఉగాది



చిట్టిమల్ల భిక్షం, నల్లగొండ

వచ్చె ఆమని నిండు
యవ్వనము తోడ
వన్నెచిన్నెలు చిలుకుతు
వసుధ లోన
విరగ బూసెను మందార
విరులు చాల
పరిమళించెను నామది ప్రకృతి జూడ



పున్న అంజయ్య
నల్లగొండ

కొత్త సంవత్సరం వచ్చింది కొత్త
ఆనందాన్ని తెచ్చింది
ఇంద్రధనస్సు వంటి తలంపులతో
షడ్రుచుల వంటి అభిరుచులతో
శిశిరం నుండి వసంతం వైపు
నిశీధి నుండి నవోదయం వైపు
షడ్రుచుల ఉగాది పచ్చడితో భవిష్యత్తును తెలిపే
పంచాంగ శ్రవణంతో
ఆటుపోట్లుతో జీవితం ఆగిపోదు అని కృషితోనే
జీవితం ముందుకు సాగును అని



బొల్ల ప్రవీణ్, కొరటికల్, మునుగోడు

అవనిపై నూతన కాంతులు నింపగలవే!
జనులకు నీపై విశ్వాసము కలిగించగలవే!
అవినీతి కోయిలల చేత
కమ్మని నీతి రాగాలు తీయించగలవే!
స్వార్థము నిండిన జనుల హృదయాల్లో
ప్రేమానురాగాలు ఇంపుగ నింపగలవే!
రాజకీయ రామచిలుకల చేత
రమ్యంగా సత్య వచనాలు పలికించగలవే!
డబ్బే పరమావధిగా.. ప్రజల ఆరోగ్యం పట్టని
వ్యాపారుల న్యాయ మార్గంబున నడుపగలవే!



సిల్వేరు నర్సింహ, చిట్యాల

విశ్వావసునామాన
శోభాయమానముగ వచ్చెనదిగో
ఉగాది వత్సరమ్ము చైత్ర మాసము
నందు చెట్లన్నీ చిగురింప
వసంత కాలమ్ము వచ్చెననుచు
మావి చిగురు తిన్న మత్త కోయిలలు కుహూకుహూ
రాగాలు కూయుచుండ
ఉప్పు, తీపి, వగరు, చేదు, కారం,
పులుపు, ఆరు రుచుల పచ్చడారగించి
పుడమినందు జనులు పులకించిపోయిరి
సత్ బ్రాహ్మణులంతా సమావేశం పెట్టి
పంచాంగ శ్రవణమ్ము చదువుచుండ
జనులంత గుమికూడి తమ జాతకంలోని
మంచిచెడులనడిగి తెలుసుకొనిరి



వై. దేవదానం, శ్రీనగర్ కాలనీ, నల్లగొండ

ఈసారైనా!
తీపి, చేదు, పులుపు,
వగరు, ఉప్పు, కారం
షడ్రుచుల సమ్మేళనభరితమైన
ఉగాది పచ్చడిలా
జీవితాన్నెంత ఊహించుకుంటున్నా
బతుకెప్పుడూ పచ్చడి పచ్చడే అవుతుంది
ఎంతో ఆశగా ఎన్నిసార్లు జీవితాన్ని చవిచూసినా
జీవితమెప్పుడూ చేదే కొడుతోంది
అమ్మా ఉగాదీ! ఈసారైనా షడ్రుచుల సమ్మేళనంగా
జీవితాన్ని రుచి చూపిస్తావా?



చిత్తలూరి, నకిరేకల్

ఓ నవ ఉగాది..!
ఓ ఉగాది వత్సరమా..!
నూతన సంవత్సరమా
నీకు కోటి ఆశలతో స్వాగతం
క్రోధి నామమా..
గాయాలు నింపి పోతున్నవా
విశ్వావసు సంవత్సరమా
కోరికలు తీర్చ వస్తున్నవా
ఏవేవో కలలు మాపి కొన్నయినా నెరవేర్చవా
కన్నీరయిన కారకుండ నీ ఒడిలో లాలించగలవా



బి.సిరిచందన, నల్లగొండ

కాలం.. మరో సరికొత్త అధ్యాయాన్ని ఆవిష్కరిస్తది
జారిపోతున్న కాలపు జ్ఞాపకాలను
అపురూపంగా ఒడిసిపట్టుకుంటది
కాలం కలిసిరానప్పుడు
కాల గర్భంలో కలిసిపోవాల్సిందే
నరుడు స్వార్థానికి లోనైనప్పుడు
డబ్బులకు దాసోహమైనప్పుడు
వావివరసలు మరిచినప్పుడు
కాల రుతుచక్రం మారుతుంటది
క్రోధి నామ వత్సరానికి వీడ్కోలు
విశ్వావసు సంవత్సరానికి
స్వాగతం..! సుస్వాగతం..!!



కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, రచయిత,

వసంతం వసంతం శుభ వసంతం
చైతన్యాన్ని అంకురింపచేసే నవ
వసంతం
తెలుగు నేలలో ఆనందాలు
పంచే వసంతం
పచ్చదనంతో కళకళలాడే పల్లె సీమలు
శ్రావ్యమైన వసంత కోకిల మధుర గానాలు
మామిడి తోరణాలతో మెరిసే గుమ్మాలు
షడ్రుచులను పరిచయం చేసే ఉగాది పచ్చళ్లు
భవిష్యత్తును తెలిపే పంచాంగ శ్రవణం



కుక్కడపు శ్రీనివాసు, వల్లాల, శాలిగౌరారం

కొత్త సంవత్సర తొలి రోజుని,
కొంగొత్త ఆశల ఉషస్సుని,
నవ వసంత ప్రతీకని,
అరవిరిసిన పచ్చని (ప్రకృతి)
కంబళిని ..
అడవి తల్లి నుదుటన మోదుగు సింధూరాన్ని,
మత్త కోకిల స్వర గానామృతాన్ని,
వగరు, పులుపు, తీపి, చేదుల వినూత్న పచ్చడిని,
సుఖ దుఃఖాల కావడిని, రవిచంద్రుల గమనాన్ని,
గ్రహ గతుల రాశి చక్రాన్ని,
తెలుగు నాట ఉగాదిని, యుగానికి ఆదిని
మీకు శుభాలనిచ్చి, సంతసం నింపే..విశ్వావసుని..
మీ సహవాసిని...



అభిమన్యు, టీచర్, నకిరేకల్

పండుగలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయి



మర్రిగూడ: ఇఫ్తార్ విందులో పాల్గొన్న తహసీల్దార్

చిట్యాల: పట్టణంలోని మసీదులో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పండుగలు ప్రజల్లో ఐక్యమత్యాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణనాయక్, మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, మాజీ ఎంపీటీసీ ఎద్దులపురి కృష్ణ, ఇబ్రహీం, ముబీన్ పాల్గొన్నారు.

నల్లగొండ: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం నల్లగొండలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీజీఓస్ గౌరవ అధ్యక్షుడు ముజీబుద్దీన్, అసోసియేట్ అధ్యక్షుడు అమరేందర్, సందీప్, గూడ వెంకటేశ్వర్లు, నాగిళ్ల మురళి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చండూరు : చండూరులో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చండూరు ఆర్డీఓ శ్రీదేవి, తహసీల్దార్ దశరథ నాయక్, డిప్యూటీ తహసీల్దార్ విజయ, ముజాహిద్, ఖమ్రుద్దీన్, నిరంజన్ అలీ, ఎజాస్, షరీఫ్, సజ్జుపాషా, జిన్నా తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ బక్క శ్రీనివాసులు కార్యాలయ సిబ్బందితో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్, రజాక్, జబ్బార్, వాహీద్, ఖలీల్, రంజాన్ పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

తిప్పర్తి : మండల కేంద్రంలోని మసీదులో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తండు నర్సింహగౌడ్ శనివారం 70 ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, కందుల లక్ష్మయ్య, నాగేశ్వర్ రావు, కొమ్ము గిరి, వెలుగుపల్లి శ్రీనివాస్, జాకటి బాలయ్య, గుండు వెంకన్న, గుండు రవి, ఆనంద్, మహబూబ్ జాని, షకీల్, సలీం పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

కనగల్ : మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు వద్ద 2018వ సంవత్సరంలో అంబేద్కర్ భవనం మంజూరైనా స్థలం కేటాయించలేదని, వెంటనే స్థలం కేటాయించాలి కోరుతూ శుక్రవారం తహసీల్దార్ పద్మకు ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి పెరిక అంజయ్య వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కురుపాటి గణేశ్, మండల అధ్యక్షుడు పందుల రాజా పందుల వెంకటేశం, పెరిక నాగార్జున, కొండ మహేష్, దుబ్బ వెంకటేశం, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

నల్లగొండ: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. శనివారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ, అమిత్ షా భారత రాజ్యాంగాన్ని అవమానపరిచేలా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీపై ఉందన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పిలుపు మేరకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీడ్ కార్పొరేషన్ చైర్మన్, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి, సంజీవ్, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి, పోలగోని సత్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్‌నాయక్